క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ముప్పాళ్ళ: ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత జరుగుతున్న గొడవల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలపై పలు సూచనలు చేశారు. సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెంచాలని సూచించారు. అనంతరం మాదల గ్రామాన్ని సందర్శించి, స్థానికులతో మాట్లాడారు. సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై పి.హజరతయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సత్తెనపల్లి రూరల్ సీఐగా శ్రీనివాసరావు



సత్తెనపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి రూరల్ సీఐగా పోలూరి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సత్తెనపల్లి టౌన్ సీఐగా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన ఆయన బదిలీపై అప్‌గ్రేడ్ అయిన సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌కు సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్తెనపల్లి రూరల్ మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ప్రజలంతా సహకరించాలని కోరారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా డీఎస్పీ జి.గురునాథ్‌బాబును కలిశారు. బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాసరావుకు సత్తెనపల్లి రూరల్ పోలీ స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



అమరావతి: మండల పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంటి వైద్యాధికారి పి.సుబ్బారావు తెలిపారు. బుధవారం స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో సుమారు 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అందులో 20 మందికి దృష్టి సమస్యలను గుర్తించి కళ్లజోళ్లకు సిఫార్సు చేశామన్నారు. వారికి కళ్ళజోళ్లు ఉచితంగా అందచేస్తామన్నారు. అలాగే 10 మంది విద్యార్థులలో కళ్లకలకను గుర్తించి మందులు పంపిణీ చేశామన్నారు. అలాగే మండలంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 27వ తేదీ వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు.

తల్లి పాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది



88త్యాళ్లూరు(క్రోసూరు): ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం మండలంలోని 88త్యాళ్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు తల్లులకు, బాలింతలకు, గర్భిణులకు తల్లి పాల ప్రాముఖ్యతను తెలిపారు. బిడ్డపుట్టిన అరగంటలోపు తల్లి ముర్రుపాలు పట్టించాలని అన్నారు. అదేవిధంగా ఆరునెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని తద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు మంగమ్మ, మల్లేశ్వరి, ప్రభావతి, తిరుపతమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అచ్చంపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన స్థానిక సాయిబాబా దేవాలయం సమీపంలోని వే బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరులో నివాసముంటున్న తుమ్మా జగదీష్‌రెడ్డి అచ్చంపేట నుంచి బైక్‌పై క్రోసూరు వెళుతుండగా వే బ్రిడ్జి సమీపించగానే ఎదురుగా వచ్చే ఆటో ఢీ కొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో జగదీష్‌రెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108 అంబులెన్స్‌లో సత్తెనపల్లిలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్‌లో నివాసం ఉంటూ పాలవ్యాపారం చేసుకునే తుమ్మా ప్రసాదరెడ్డి రెండవ కుమారుడు జగదీష్‌రెడ్డి తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసిన జగదీష్‌రెడ్డి త్వరలో ఫారన్ వెళ్లే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది. ఇంతలో ఈ ఘటన జరిగింది.

రాజకీయ ప్రాబల్యానికి వేదికగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

- గత ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి కోసం కమిటీలు
- నేటి కూటమి ప్రభుత్వంలో పెత్తనం కోసం తహతహలు
- నేడు నియోజకవర్గంలో 225 పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు



పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సత్తెనపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సమాజంలో అన్ని రంగాల్లో తన ప్రాబల్యాల్ని చూపెడుతోంది. అప్పటి వరకూ ఉన్న వ్యవస్థలను మార్పు చేస్తూ ఆయా రంగాల్లో రాజకీయాలను చొప్పిస్తోంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల రూపంలో మరో అవకాశం వచ్చింది. కేవలం విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం ప్రారంభించిన ఈ ఎన్నికలు ఈ విడత రాజకీయ ప్రాబల్య నిరూపణకు వేదికలుగా మారబోతున్నాయి. ఎస్‌ఎంసీల పేరుతో ప్రభుత్వ సూచన మేరకు జిల్లా, మండల విద్యా శాఖ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఓటర్ల జాబితాలు కూడా ప్రకటించారు. ఈ నెల 8న (నేడు) సత్తెనపల్లి నియోజకవర్గంలోని 225 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

సందడిగా ఎన్నికల నిర్వహణ

ప్రభుత్వ ఆదేశాలతో ప్రారంభమైన ఎన్నికల నిర్వహణ సందడిగా మారింది. పాఠశాలల్లో సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతి యూనిట్‌గా ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు, ముగ్గురిలో ఒకరు తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనార్టీకి చెందిన వ్యక్తి అయి ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 శాతం ఓటర్లు హాజరును రిజిస్టర్లో చూపిన తర్వాతే ఎన్నిక నిర్వహించాలి. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కూడా 50 శాతం సభ్యుల హాజరు ఉండాలి. తరగతుల వారీగా ఎన్నికైన సభ్యులందరూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా ఉంటారు. వారంతా కలిసి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. తరగతిలో కనీసం ఆరుగురు విద్యార్థులు లేకపోతే మరో తరగతిలోకి విలీనం చేసి ఎన్నుకోవాలి.

పరిశీలకులుగా అధికారులు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా ఉంటారు. తహసీల్దార్, ఎంపీడీవో, వీఆర్వోలు ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లి, తండ్రి, పిల్లల సంరక్షకులుగా ఉన్న వారు ఓటర్లుగా ఉంటారు. ఈ నెల 5న ఓటరు జాబితాపై అభ్యంతరాలు పూర్తయ్యాయి. 8వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహించాలి. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలో ప్రతి సభ్యుడికి రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.

ప్రస్తుతం పెత్తనం కోసం

కొత్త ప్రభుత్వంలో కూటమి పార్టీల నాయకులు పాఠశాలల ఎన్నికలపై దృష్టి సారించారు. ఆయా పాఠశాలలపై కూడా తమ పెత్తనాన్ని నిరూపించుకోవడానికి ఈ ఎన్నికల్లో రాజకీయాలు చొప్పిస్తున్నారు. ఈ మేరకు కూటమికి చెందిన వారిని చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నుకోవాలనే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే క్షేత్ర స్థాయిలో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలకు పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు వేదిక కావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే విద్యారంగానికి సంబంధించి తల్లికి వందనం వంటి పథకాల అమల్లో తీవ్రంగా విఫలమైన కూటమి నాయకులను తల్లిదండ్రులు ఏ మేరకు విశ్వసిస్తారు అనేది వేచి చూడాలి. కాగా ఈ ఎన్నికలు సజావుగా నిర్వహిస్తారా అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. ఎస్‌ఎంసీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గత ప్రభుత్వంలో అభివృద్ధే లక్ష్యంగా

గత ప్రభుత్వంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధి కోసమే పని చేశారు. అప్పట్లో ప్రభుత్వం సైతం కమిటీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నాడు–నేడు పనులు కమిటీ సభ్యులకే అప్పగించింది. దీంతో ఆ పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగాయి. ప్రతి నెలా సమావేశం నిర్వహించి విద్యార్థుల పురోగతి, పాఠశాల అభివృద్ధి పనులపై సమీక్ష చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేవారు. దీంతో పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు కూడా విశేషంగా పెరిగాయి. దానికి తోడు కమిటీ పెద్దలే విద్యార్థులను ప్రోత్సహించే నిమిత్తం దాతల నిధులు సమీకరించి వివిధ పోటీలు నిర్వహించడం, వారికి బహుమతులు ఇవ్వడం, విద్యార్థులకు అవసరమైన విద్యా విషయక వస్తువులను అందజేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

కేజీబీవీలో జీవన నైపుణ్యాలపై అవగాహన



క్రోసూరు: గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్రోసూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో జీవన నైపుణ్యాలపై అవగాహన సదస్సు జరిగింది. సంస్థ కార్యకర్త లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బచపన్ బచావో స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతిరావు హాజరై మాట్లాడుతూ పిల్లలకు జీవిత నైపుణ్యాలు తప్పకుండా అవసరమని అన్నారు. మంచి కమ్యూనికేషన్ ఉంటే భవిష్యత్తు బావుటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ బలాలు.. బలహీనతలు తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక విద్యార్థి తమ స్థాయిని తెలుసుకొని చదవాలన్నారు. గుడ్ షెపర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిర్ణయం తీసుకునే అధికారం కలిగి ఉండాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యం కలిగి ఉండాలన్నారు. కౌమార దశలో పిల్లలు ఆకర్షణకు గురై జీవితాలను పాడు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది బ్యూలా మరియమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కేంద్ర మంత్రులను కోరిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



కేంద్ర మంత్రులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు

సత్తెనపల్లి: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, రైల్వే మంత్రి జేపీ నడ్డా, కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడులను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి ఆయన కలిశారు. ఈ సందర్భంగా కొండమోడు–పేరేచర్ల జాతీయ రహదారి విస్తరణ అభివృద్ధికి నిధులు మంజూరుతో పాటు పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని రైల్వే గేటు వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. జాతీయ రహదారి మార్గంలో సత్తెనపల్లి పట్టణ పరిధిలోని అమరావతి మేజర్ కాలువపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

రైతులందరూ పంట నమోదు చేసుకోవాలి



వ్యవసాయ, ఉద్యాన సిబ్బందితో సమీక్ష సమావేశంలో క్రోసూరు ఏడీఏ హనుమంతరావు

అమరావతి: మండలంలో రైతులందరూ తమ పొలాల్లో వేసిన పంటను నమోదు చేసుకునేలా గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు కృషి చేయాలని క్రోసూరు వ్యవసాయ శాఖ ఏడీఏ హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండలంలోని వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ గ్రామాలలో కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు రైతు కార్డులు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి రైతు తమ పంట వివరాలను దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు పంట నమోదులో వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది సహకరించటమే కాకుండా సాగు సమయంలో తగు సలహాలు, సూచనలు ఇవ్వటానికి నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శకత పెరుగుతుంది



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు వెంకట్రావు

అచ్చంపేట: ప్రతి ప్రభుత్వ శాఖలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్న లక్ష్యంతోనే 2005లో సమాచార హక్కు చట్టం తీసుకురావడం జరిగిందని జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు పి.వెంకట్రావు తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయా శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం–2005పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికార యంత్రాంగంలో జవాబుదారీ విధానాన్ని తీసుకువచ్చేందుకు వారి ఆధీనంలో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకే సమాచారం హక్కు చట్టాన్ని చట్టబద్ధం చేసినట్లు చెప్పారు. దేశం మొత్తానికి ఈ చట్టం వర్తిస్తుందని చెప్పారు. ఈ చట్టం ద్వారా ఎవరైనా ఏ శాఖ నుంచైనా తగిన సమాచారాన్ని దరఖాస్తు చేసిన నాటి నుంచి 30 రోజులలోపు రాబట్టవచ్చని చెప్పారు. ఇందుకు అయ్యే ఖర్చును దరఖాస్తుదారు సంబంధిత శాఖకు చెల్లించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి

పారదర్శకత తీసుకురావటమే సమాచార హక్కు చట్టం లక్ష్యం

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలలోని సమాచారం ప్రజలకు తెలియటం కోసం, ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావటం కోసం ఈ సమాచార హక్కు చట్టం తీసుకురావటం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో సమాచార హక్కు చట్టం -2005పై వ్యవసాయ శాఖ సిబ్బందికి, రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోని సమాచారం కొరకు ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి? ఎంత రుసుం చెల్లించాలి? ఎన్ని రోజులలో సమాచారం పొందవచ్చు? వంటి వివరాలు తెలియజేశారు. అధికార యంత్రాంగం అదుపులో ఉన్న సమాచారాన్ని పౌరులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఈ సమాచార హక్కు చట్టం రూపకల్పన చేయటం జరిగిందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విత్తన దుకాణంలో తనిఖీలు



నకరికల్లు: నిబంధనల మేరకు విత్తనాల విక్రయాలు ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు డీలర్లను ఆదేశించారు. స్థానిక చిన్నయ్య అండ్ సన్స్ విత్తనాల దుకాణంలో బుధవారం తనిఖీలు నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా బిల్ బుక్స్, సోర్స్ ఆఫ్ సప్లై సర్టిఫికెట్లు, విత్తన నిల్వలు పరిశీలించారు. విత్తన నమూనాలు సేకరించి నాణ్యతా ప్రమాణాల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన కొనుగోలుదారులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలన్నారు. రశీదుపై అమ్మకందారుని, కొనుగోలుదారుని సంతకం లాట్ నంబర్ ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పెదకూరపాడు: చేనేత సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్ అన్నారు. మండలంలోని లగడపాడు గ్రామంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ చేనేత దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని సంక్షేమంలోకి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.అప్పారావు, ముంతాజ్, వి.శివయ్య, ఎం.చంద్రం, యంపరాల వెంకటేశ్వర్లు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సర్పంచ్, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు

నకరికల్లు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు 3 రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.జయమణి బుధవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్ట్రాటజీ తదితర కార్యక్రమాలపై శిక్షణ ఉంటుందన్నారు. 12వ తేదీన మొదటిరోజు గ్రామ పంచాయతీ బాధ్యతలు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్తసేకరణ, వర్మీ కంపోస్టు తయారీ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, థీమాటికల్ జీపీడీపీ తయారీ విధానం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. 13వ తేదీన మొదటిరోజు అంశాలతో పాటు పరిపాలన అంశాలపై, 14వ తేదీన వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ, సీసీ చార్జీల చెల్లింపు, ప్రభుత్వ విధానం, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్రస్థాయి పర్యటన, శిక్షణ అంశాలపై పరీక్ష ఉంటుందన్నారు. అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని సూచించారు.

పులిచింతల ప్రాజెక్టు ద్వారా మెరుగైన సేవలు

ఎమ్మెల్యేలు ప్రవీణ్, శ్రీరాంతాతయ్య



పులిచింతల ప్రాజెక్టు వద్ద పూజల్లో ఎమ్మెల్యేలు ప్రవీణ్, శ్రీరాంతాతయ్య

అచ్చంపేట: ఇకపై పులిచింతల ప్రాజెక్టు ద్వారా మెరుగైన సేవలను రైతులకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్యలు తెలిపారు. కృష్ణానదికి రెండు వైపుల ప్రాతినిధ్యం వహిస్తున్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్యలు బుధవారం పులిచింతల ప్రాజెక్టును సందర్శించారు. ముందుగా జలకళతో పరవళ్లు తొక్కుతున్న కృష్ణా జలాలకు ప్రాజెక్టు పై నుంచి హారతులు ఇచ్చారు. కృష్ణమ్మతల్లికి చీర, సారె సమర్పించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పటిష్టత, సామర్థ్యం, రైతులకు అందే సౌకర్యాలు తదితర విషయాలను ప్రాజెక్టు అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఇకపై పులిచింతల ప్రాజెక్టు నుంచి కృష్ణా, డెల్టా ప్రాంత రైతులకే కాకుండా దిగువ ప్రాంత రైతులందరికీ మెరుగైన సేవలు అందజేస్తామని చెప్పారు. రెండు జిల్లాల రాకపోకలను సుగమం చేసేందుకు కృష్ణానదిపై గత ప్రభుత్వ హయాంలో మంజూరైన బ్రిడ్జిని రెండేళ్లలో పూర్తి చేసి, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామకృష్ణ, ఏఈ గుణకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పారుపల్లిలో కొనసాగుతున్న వైద్యశిబిరం



పారుపల్లి గ్రామంలో ఇళ్లను పరిశీలిస్తున్న మలేరియా అధికారి రత్నాకర్, సిబ్బంది

పారుపల్లి(క్రోసూరు): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని పారుపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం బుధవారం కొనసాగింది. ఈ వైద్య శిబిరంలో 35 మందికి వైద్య పరీక్షలు చేయటం జరిగిందని ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతిర్మయి తెలిపారు. జ్వరాల కేసు ఒకటి ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డీఎంవో రవీంద్ర రత్నాకర్ హాజరై గ్రామంలోని అన్ని వీధులు పరిశీలించారు. ఆయన దగ్గరుండి పెరిడొమెస్టిక్ చేయించారు. మురుగు కాలువల్లో లార్వాను నిర్మూలించేందుకు ఎబ్బెట్ ద్రావణం పిచికారీ చేయటం, పిచ్చిచెట్లు, కంప ఇళ్ల మధ్య లేకుండా తొలగించి శుభ్రంగా ఉంచటం, నీళ్ల నిలబడే ప్రదేశాలలో నీళ్లను తొలగించటం చేపట్టారు. జ్వరాలు రాకుండా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జీవో 117 ప్రకారం టీచర్ల పని సర్దుబాటు సరికాదు

పీఆర్‌టీయూ ఏపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బంకా వాసుబాబు



సత్తెనపల్లి: పాఠశాల విద్య అన్ని రకాలుగా నష్టపోయిందని, జీవో నంబర్ 117 ప్రకారం ఉపాధ్యాయుల పని సర్దుబాటు సరికాదని పీఆర్‌టీయూ ఏపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బంకా వాసుబాబు అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని అన్ని సంఘాలు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జీవో 117ను రద్దు చేస్తామని, 3, 4, 5 తరగతుల విలీనాన్ని వెనక్కి తీసుకుంటామని, పాఠశాల విద్యను గాడిలో పెడతామని, ఉపాధ్యాయుల పని భారాన్ని తగ్గిస్తామని స్పష్టమైన హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా జీవో నెంబర్ 117 ప్రకారమే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయడానికి పూనుకోవడం ఎంత మాత్రం సబబు కాదన్నారు. వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటులో 3, 4, 5 తరగతుల బోధనకు ఎస్జీటీలను పంపి, స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలకు పంపాలని, అలాగే 10 లోపు ఉన్న పాఠశాలలను మూసివేయాలనే యోచన చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయుల లోటు ఉన్న పాఠశాలల్లో విద్యావలంటీర్ల నియామకం చేపట్టాలని, ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారని, కావున వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు శ్యాంమోజెస్ ఉన్నారు.

వైభవంగా చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో చెన్నై షాపింగ్ మాల్ బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ తార అనుపమ పరమేశ్వరన్ హాజరయ్యారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. వస్త్ర ప్రపంచంలో ఉన్న నూతన డిజైన్లను వంటిపై వేసుకొని చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ధరలకే నూతన డిజైన్లతో కూడిన నాణ్యమైన దుస్తులు చెన్నై షాపింగ్ మాల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 25 సినిమాలలో నటించటం జరిగిందని, మరో 7 సినిమాల్లో నటించబోతున్నట్లు తెలిపారు. అనంతరం మాల్ వద్ద ఏర్పాటు చేసిన డీజే టిల్లు 2 లోని పాటకు స్టెప్పులు వేసి ప్రజలను అలరింపజేశారు.

నీటిలో ఫ్లోరోసిస్ సాంద్రత ఎక్కువ ఉంటే ఫ్లోరోసిస్ వస్తుంది



ఫ్లోరోసిస్ వ్యాధిపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గిరిధర్

రాజుపాలెం: రోజువారీ తాగే నీటిలో ఫ్లోరోసిస్ సాంద్రత ఎక్కువగా ఉండడం వలన ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందని ఫ్లోరోసిస్ వ్యాధి నిపుణులు డాక్టర్ గిరిధర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాజుపాలెం, చంద్రాజుపాలెం ఆరోగ్య కేంద్రాల ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలకు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ బోరు బావుల్లోని నీటిలో ఫ్లోరైడ్ 1 పీపీఎం కన్నా ఎక్కువగా ఉంటే ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందన్నారు. అలాంటి నీటిని తాగరాదని.. ఎక్కువగా కాల్షియం, సీ విటమిన్ ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. రోజు తాగే నీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మీ పరిధిలోని గ్రామాలలో ఇంటింటా సర్వే చేసి ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి వైద్య సేవలు అందేటట్టు చూడాలని అన్నారు. అనంతరం రెడ్డిగూడెం ఉర్దూ పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాలఅంకమ్మబాయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



ముప్పాళ్ళ: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలకు తోడు సాగర్ జలాలు విడుదల కావటంతో కాల్వలు పొంగి పొలాల్లోకి చేరాయి. మండలంలోని గోళ్ళపాడు గ్రామం ఎస్టీ కాలనీలో గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, రెవెన్యూ శాఖ సిబ్బంది కాలనీని సందర్శించి నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టారు. మొత్తం 29 గృహాలకు చెందిన వారికి అవసరమైన అల్పాహారం, భోజనం వసతి కల్పించారు. మాదల, దమ్మాలపాడు, ముప్పాళ్ళ గ్రామాలలో సాగు చేసిన పత్తి పంటలో వర్షపు నీరు నిలిచిపోయింది.